జ్వాల
# దశ
నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM
శుక్రవారం
14-08-2026
సంపుటి 1 సంచిక 262
పేజీలు : 04
వెల : 1/-
PRGI No : TGTEL/25/A4195



## మారనున్న కేబీఆర్ పార్కు రూపు రేఖలు

4లో



## మన భవిష్యత్తును మార్చేది
# చదువొక్కటే
### తెలంగాణ మైనారిటీల ప్రతిభా సదస్సులో సీఎం రేవంత్

**దశ, హైదరాబాద్:** "చదువొక్కటే మన భవిష్యత్తును మార్చుతుంది. విద్యతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకుంటే ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగావకాశాలు అందుబాటులో ఉంటాయి" అని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. హిందూ, ముస్లింల మధ్య తనకు ఎలాంటి వ్యత్యాసం లేదని, ఇద్దరూ తనకు రెండు కళ్లలాంటి వారని పేర్కొన్నారు. బంజారాహిల్స్‌లోని కొమురం భీమ్ ఆదివాసీ భవన్‌లో నిర్వహించిన తెలంగాణ మైనారిటీల ప్రతిభా సదస్సులో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3, గ్రూప్ 4 తదితర ప్రభుత్వ ఉద్యోగాల్లో ఎంపికైన వారితో పాటు నీట్, ఐఐటీ, ఎన్ఐటీ వంటి జాతీయ స్థాయి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన 782 మంది మైనారిటీ అభ్యర్థులను ఈ సందర్భంగా సీఎం అభినందించారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులు చదువుకోవాలని, అనంతరం నైపుణ్యాలపై దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. నైపుణ్యాలు ఉన్నవారికి జర్మనీ, జపాన్ వంటి దేశాల్లోనూ అనేక ఉద్యోగావకాశాలు ఉన్నాయని తెలిపారు. యువతకు నైపుణ్య శిక్షణ అందించాలనే లక్ష్యంతో ఐటీఐలను ఏటీసీలుగా మారుస్తున్నామని, పాలిటెక్నిక్ కాలేజీలను స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి

..మిగతా 4వ పేజీలో →

## డ్రగ్స్ ముప్పు నుంచి
# బయటపడేదెలా?

- డ్రగ్స్ ముప్పు.. యువత భవిష్యత్తుకు పెను ప్రమాదం!
- ఒక్క తలుపు మూస్తే.. మరో నాలుగు దారులు!
- తల్లిదండ్రుల నిర్లక్ష్యమే డ్రగ్స్‌కు బలం.
- శిక్షలు కాదు.. కఠిన చర్యలతోనే డ్రగ్స్‌కు చెక్!
- ప్రతి ఇల్లు డ్రగ్స్ రహితమైతే.. దేశం డ్రగ్స్ రహితం!



**దశ, రంగారెడ్డి ప్రతినిధి :** తెలుగు రాష్ట్రాల్లో డ్రగ్స్ సమస్య రోజురోజుకూ విస్తరిస్తోంది. ఒకప్పుడు హైదరాబాద్‌కే పరిమితమని భావించిన మాదకద్రవ్యాల దందా ఇప్పుడు పట్టణాలు, విద్యాసంస్థలు, యువత వరకు విస్తరించడం ఆందోళన కలిగిస్తోంది. డ్రగ్స్ కేసుల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, వైద్యులు వంటి వృత్తుల్లో ఉన్నవారి పేర్లు కూడా వెలుగులోకి రావడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. పబ్బులు, క్లబ్బులకే డ్రగ్స్ దందా పరిమితమనే భావన క్రమంగా మారుతోంది. స్కూల్, కాలేజీ పరిసరాలు, క్యాంటీన్లు, ఆన్‌లైన్ పరిచయాలు, డెలివరీ వ్యవస్థల ద్వారా మాదకద్రవ్యాలు యువతకు చేరుతున్నాయనే ఆరోపణలు

..మిగతా 4వ పేజీలో →



## బండికి కీలక బాధ్యతలు

**దశ, హైదరాబాద్ :** తెలంగాణలో ఏలాగైనా అధికార పీఠాన్ని దక్కించుకోవడమే లక్ష్యంగా కమలం పార్టీ పావులు కదుపుతోంది. ఈ క్రమంలోనే రాబోయే అసెంబ్లీ సమరానికి పార్టీని సిద్ధం చేసేందుకు నేతృత్వంలో మార్పులు ఉంటాయా, లేక ప్రస్తుత సారథ్యాన్నే కొనసాగిస్తారా అనే అంశం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా

..మిగతా 4వ పేజీలో →



## మేడిగడ్డ బ్యారేజీ కేసు.. కేసీఆర్‌కు మళ్లీ నోటీసులు

**దశ, హైదరాబాద్:** కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుకు సంబంధించిన కేసులో మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు జయశంకర్ భూపాలపల్లి జిల్లా కోర్టు మరోసారి నోటీసులు జారీ చేసింది. గతంలో పంపిన నోటీసులు ఆయనకు అందలేదని తేలడంతో మళ్లీ నోటీసులు జారీ చేయాలని కోర్టు ఆదేశించింది. నోటీసులు పక్కాగా అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా న్యాయవాదిని ఆదేశించింది. ఈ కేసు తదుపరి విచారణను సెప్టెంబర్ 9కి వాయిదా వేసింది. మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణంలో అక్రమాలు, నాణ్యతా లోపాలపై దాఖలైన ప్రైవేట్ పిటిషన్‌పై విచారణ కొనసాగుతోంది.



## మోడీ బహుమతుల వేలంతో
# 52 కోట్లకు పైగా నిధులు

**దశ, న్యూఢిల్లీ :** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి వివిధ సందర్భాల్లో అందే కానుకలు, స్మృతిచిహ్నాలు ఇప్పుడు ఆసక్తికరమైన అంశంగా మారాయి. ప్రధాని అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్నప్పుడు, వివిధ సంస్థలు, ప్రముఖులు, రాజకీయ నాయకులు, క్రీడాకారులు, ఇతర ప్రతినిధులు ఆయనకు అనేక రకాల బహుమతులు, మెమెంటోలు అందజేస్తుంటారు. వీటిని కేంద్ర ప్రభుత్వం క్రమం తప్పకుండా ఇవేలం నిర్వహించి విక్రయిస్తోంది. ఈ వేలాల ద్వారా ఇప్పటివరకు రూ.52 కోట్లకు పైగా ఆదాయం సమకూరినట్లు కేంద్రం వెల్లడించింది. కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షేఖావత్ లోక్‌సభలో ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో ప్రధాని కానుకల వేలం ద్వారా వచ్చిన ఆదాయానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. నేషనల్ గ్యాలరీ ఆఫ్ మోడర్న్ ఆర్ట్ ఆధ్వర్యంలో ఈ వేలం ప్రక్రియ కొనసాగుతోంది.

2021 తొలి ఎడిషన్: రూ.3.1 కోట్లు
2022 రెండో ఎడిషన్: రూ.3.6 కోట్లు
2023 మూడో ఎడిషన్: రూ.15.8 కోట్లు
2023 నాలుగో ఎడిషన్: రూ.14.4 కోట్లు
2024 ఐదో ఎడిషన్: రూ.11.16 కోట్లు
2024 ఆరో ఎడిషన్: రూ.2.24 కోట్లు
2025 ఏడో ఎడిషన్: రూ.1.89 కోట్లు
ఈ మొత్తం కలిపితే రూ.52 కోట్లకు పైగా

..మిగతా 4వ పేజీలో →


## వెంకటేశ్, రానా సహా దగ్గుబాటి కుటుంబానికి
# హైకోర్టులో చుక్కెదురు



**దశ, హైదరాబాద్:** ప్రముఖ సినీ నటులు వెంకటేశ్, రానా దగ్గుబాటి, దగ్గుబాటి అభిరామ్, నిర్మాత డి. సురేశ్ బాబులకు తెలంగాణ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తమపై నమోదైన చోరీ, అక్రమ ప్రవేశం తదితర ఆరోపణలకు సంబంధించిన క్రిమినల్ కేసును కొట్టివేయాలని వారు దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించింది. ఫిలింనగర్‌లోని డెక్కన్ కిచెన్ రెస్టారెంట్ ఆస్తికి సంబంధించిన వివాదంలో వ్యాపారవేత్త కోరె నందు కుమార్ ఫిర్యాదు చేశారు. తాను లీజుకు తీసుకున్న స్థలంలోని నిర్మాణాలను నిందితులు అక్రమంగా


..మిగతా 4వ పేజీలో →

# హీరోగా హిమాన్షు



**దశ, హైదరాబాద్:** స్టార్ హీరోలకు సంబంధించిన వారసులు సినీ ఇండస్ట్రీ లోకి హీరో గా ఎంట్రీ ఇవ్వడం కొత్తేమి కాదు , గత దశాబ్దాలుగా అనాదిగా వస్తున్న ఆచారమే ఇది. అదే విధంగా ప్రముఖ రాజకీయ నాయకుల వారసులు కూడా రాజకీయాల్లోకి రావడం మాత్రమే ఇది వరకు మనమంతా చూసాము. సినిమాల్లోకి ఎంట్రీ ఇచ్చినట్టు ఎక్కడా హిస్టరీ లో లేదు. అయితే తొలిసారిగా రాజకీయాల్లో అత్యంత కీలక పాత్ర పోషిస్తున్న ఒక ప్రముఖ రాజకీయ నాయకుడు కుమారుడు సినీ ఇండస్ట్రీ లోకి ఎంట్రీ ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు ఇండస్ట్రీ వర్గాల్లో బలంగా వినిపిస్తున్న వార్త. ఆ రాజకీయ నాయకుడు మరెవరో కాదు . అతని కుమారుడు హిమాన్షు రావు సినీ రంగం లోకి అడుగు పెట్టేందుకు అమితాసక్తి ని చూపిస్తున్నట్టు సమాచారం.హిమాన్షు రావు ఇప్పటికే సంగీతం లో తన ప్రతిభ ని చాటుకున్నాడు. ఇతన్ని సోషల్

..మిగతా 4వ పేజీలో →



## ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

దశ, హైదరాబాద్: ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ tకృష్ణారెడ్డి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై విచారణను రాజేంద్రనగర్ కోర్టు రేపటికి వాయిదా వేసింది. పోలీసుల తరఫున కౌంటర్ దాఖలు చేయాలని కోర్టు ఆదేశించింది. బెయిల్ పిటిషన్‌పై ఇరుపక్షాల వాదనలు కొనసాగుతున్న సమయంలో పోలీసుల

..మిగతా 4వ పేజీలో →




## బిడ్ వేసి చేతులెత్తేసిన బిల్డర్.. రూ.5 కోట్లు లాస్

4లో

## ఫిరాయింపు ఎమ్మెల్యేల
# రివర్స్ గేర్

### గులాబీ గూటివైపు చూపులు?

- పోచారం వ్యాఖ్యలతో కాంగ్రెస్‌లో కలకలం
- దానం, గూడెం వైఖరిపైనా ఆసక్తి
- సంజయ్, కృష్ణమోహన్‌రెడ్డిపైనా ఒత్తిడి
- కేసీఆర్‌తో టచ్‌లో ఉన్నారా?




వివరాలు 4లో

# భవిష్యత్తును మార్చేది చదువొక్కటే

**మొదటి పేజీ తరువాయి**

తీసుకొచ్చామని చెప్పారు. చిన్న కుటుంబాల నుంచి వచ్చి ఎంతో కష్టపడి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను సీఎం అభినందించారు. మైనారిటీలకు కల్పించిన 4 శాతం రిజర్వేషన్లను తొలగించేందుకు ప్రయత్నాలు జరిగినా అవి విజయవంతం కాలేదని పేర్కొన్నారు. సంక్షేమ కార్యక్రమాల్లో మైనారిటీలకు ప్రాధాన్యత ఇస్తున్నామని, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకం ద్వారా మైనారిటీ వర్గాలు కూడా గణనీయంగా లబ్ధి పొందుతున్నాయని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో గ్రూప్ 1తో పాటు పెద్దఎత్తున ఉద్యోగ నియామకాలు జరగలేదని సీఎం విమర్శించారు. గ్రూప్ 1 పరీక్షా పత్రాల లీకేజీ వ్యవహారాన్ని ప్రస్తావిస్తూ, పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో అర్హత కలిగిన వ్యక్తులను సభ్యులుగా నియమించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యూపీఎస్సీ చైర్మన్‌తో పాటు నిపుణులతో చర్చించి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను పూర్తిగా ప్రక్షాళన చేశామని సీఎం తెలిపారు. ఉద్యోగ నియామకాలను అడ్డుకునేందుకు అనేక ప్రయత్నాలు జరిగినప్పటికీ, హైకోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు న్యాయపరంగా పోరాడి నియామకాలను పూర్తి చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, మహమ్మద్ అజారుద్దీన్, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్, టీజీఎంఆర్ఈఐఎస్ అధ్యక్షుడు మహమ్మద్ ఫహీముద్దీన్ ఖురేషితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## వెంకటేశ్, రానా సహా దగ్గుబాటి కుటుంబానికి హైకోర్టులో చుక్కెదురు

**మొదటి పేజీ తరువాయి**

కూల్చివేశారని, ప్రాంగణంలోకి చట్టవిరుద్ధంగా ప్రవేశించి విలువైన వస్తువులను తీసుకెళ్లారని ఆయన ఆరోపించారు. తనను, తన కుటుంబ సభ్యులను బెదిరించారని, కోర్టు స్టే ఉత్తర్వులు అమల్లో ఉన్నప్పటికీ వాటిని ఉల్లంఘించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వివాదం ప్రధానంగా సివిల్ వ్యవహారమని, అందువల్ల క్రిమినల్ కేసు విచారణ కొనసాగించడం సరికాదని దగ్గుబాటి కుటుంబ సభ్యులు, వారి అకౌంటెంట్ గడ్డం విశ్వనాథం హైకోర్టును ఆశ్రయించారు. అయితే ఈ వాదనతో జస్టిస్ ఎన్. తుకారాంజీ ధర్మాసనం ఏకీభవించలేదు. ఒకే వివాదంలో సివిల్, క్రిమినల్ అంశాలు రెండూ ఉండవచ్చని కోర్టు స్పష్టం చేసింది. నేరపూరిత చర్యలకు సంబంధించి ప్రాథమిక ఆధారాలు ఉన్నప్పుడు క్రిమినల్ విచారణను నిలిపివేయలేమని పేర్కొంది. ఫిర్యాదు, వాంగ్మూలాలు, ఫొటోలు, వీడియో ఆధారాలను పరిశీలించిన అనంతరం కింది కోర్టు కేసును విచారణకు స్వీకరించిందని తెలిపింది.

## బండికి కీలక బాధ్యతలు

**మొదటి పేజీ తరువాయి**

మారింది. ముఖ్యంగా ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావును తప్పించి, గతంలో పార్టీని పరుగులు తీటించిన కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు మళ్లీ రాష్ట్ర పార్టీ పగ్గాలు అప్పగిస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది.రాజకీయ వర్గాల్లో బండి సంజయ్ పేరు ప్రముఖంగా వినిపిస్తున్నప్పటికీ, బీజేపీ జాతీయ నాయకత్వం నుంచి మాత్రం నాయకత్వ మార్పుపై స్పష్టమైన సంకేతాలేవీ వెలువడలేదు. ఈ లెక్కన ప్రస్తుత అధ్యక్షుడు రాంచందర్ రావు పదవీకాలం ఇంకా సుమారు రెండేళ్లకు పైగా ఉంది. ఎన్నికలకు ఇంకా తగినంత సమయం ఉన్నందున, ఇప్పుడు హడావుడిగా అధ్యక్షుడిని మార్చడం వల్ల పార్టీలో నూతన అసంతృప్తులు, సమన్వయ లోపాలు తలెత్తే ప్రమాదం ఉందని అధిష్ఠానం భావిస్తున్నట్లు తెలుస్తోంది.రాష్ట్ర అధ్యక్ష పదవి రేసులో కేవలం బండి సంజయ్ మాత్రమే కాకుండా మరికొందరు అగ్రనేతలు కూడా ఉన్నారు. తెలంగాణలో బీజేపీని దూకుడుగా ముందుకు తీసుకెళ్లిన అనుభవం బండి సంజయ్ కి ఉంది. కార్యకర్తలలో ఉన్న విపరీతమైన క్రేజ్, అధికార పార్టీకి గట్టి పోటీ ఇవ్వగలరనే నమ్మకం ఆయనకు సానుకూల అంశాలు. ఇక ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్, రఘునందన్ రావు కూడా పార్టీ అధ్యక్ష పీఠం ఆశిస్తున్నారు. క్షేత్రస్థాయిలో మంచి పట్టున్న ఈ సీనియర్ ఎంపీలు కూడా అధ్యక్ష బాధ్యతల కోసం జాతీయ నాయకత్వంతో సంప్రదింపులు జరుపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.అయితే నూతన అధ్యక్షుడిని నియమిస్తే, ఆయన రాష్ట్రవ్యాప్తంగా పార్టీపై పూర్తి పట్టు సాధించడానికి కొంత సమయం పడుతుంది. ఈ విరామం ఎన్నికల సమయానికి పార్టీకి ప్రతికూలంగా మారవచ్చని కొందరు విశ్లేషిస్తున్నారు. అందుకే అధ్యక్షుడిని మార్చడం కంటే, రాంచందర్ రావునే పదవిలో కొనసాగిస్తూనే.. రేసులో ఉన్న ఇతర కీలక నేతలకు వివిధ కీలక బాధ్యతలు అప్పగించాలనే ఆలోచనలో హైకమాండ్ ఉన్నట్లు సమాచారం. మొత్తానికి, బండి సంజయ్ లేదా ఇతర నేతల పేర్లు ఎంతగా ప్రచారంలో ఉన్నప్పటికీ, ప్రస్తుతానికి రాంచందర్ రావు నేతృత్వంలోనే కమలనాథులు ముందుకు సాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే 'జమిలి' నిర్ణయం, మారే రాజకీయ సమీకరణాలను బట్టి చివరి నిమిషంలో హైకమాండ్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి!

## హీరోగా హిమాన్షు

**మొదటి పేజీ తరువాయి**

మీడియా లో అనుసరించే వాళ్లకు ఈ విషయం ఈపాటికే తెలిసే ఉంటుంది. అయితే సినీ రంగంలోకి మాత్రం ఆయన హీరోగానే ఎంట్రీ ఇవ్వాలని చూస్తున్నాడట. ఇప్పటికే ఆయన నటన లో కోచింగ్ కూడా తీసుకున్నట్టు సమాచారం. ఒక ప్రముఖ నిర్మాత హిమాన్షు ని గ్రాండ్ గా లాంచ్ చేసేందుకు సన్నాహాలు కూడా జరుగుతున్నాయట. టాలీవుడ్ లో వరుస బ్లాక్ బస్టర్స్ ని అందుకుంటున్న ఒక డైరెక్టర్ , రీసెంట్ గానే కేటీఆర్ ని కలిసి ఒక స్టోరీ ని కూడా వినిపించినట్టు టాక్. ఆ డైరెక్టర్ మరెవరో కాదు , అనిల్ రావిపూడి అని ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తున్న గుసగుసలు. దీనిపై ఎలాంటి అధికారిక సమాచారం లేదు కానీ ,హిమాన్షు సినీ రంగ ప్రవేశానికి మాత్రం పెద్ద ఎత్తున ఏర్పాట్లు జరుగుతున్న విషయం వాస్తవం.ఇదంతా పక్కన పెడితే హిమాన్షు ఈ పోటీ వాతావరణాన్ని తట్టుకొని సినీ ఇండస్ట్రీ లో రాణించగలడా?, కేసీఆర్ కుటుంబానికి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కోట్లాది మంది అభిమానులు ఉన్నారు. వీళ్ళు ఈ కుటుంబాన్ని దేవుడిలాగా పూజిస్తుంటారు. కచ్చితంగా హిమాన్షు నటించే మొదటి సినిమాకు అద్భుతమైన ఓపెనింగ్స్ ని వీళ్ళు అందిస్తారు. కానీ ఆ తర్వాత ఆయన దాన్ని నిలబెట్టుకొని ఇండస్ట్రీ లో ఎలాంటి కథలను ఎంచుకుంటూ ముందుకు వెళ్తాడు అనేదే చూడాలి.


## ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

**మొదటి పేజీ తరువాయి**

దర్యాప్తు తీరుపై ఉదయ్ కృష్ణారెడ్డి తరఫు న్యాయవాదులు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇప్పటికే పోలీసులు పలుమార్లు కోర్టు ఆదేశాలను ఉల్లంఘించారని న్యాయవాదులు మెజిస్ట్రేట్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. పోలీసులు రేపటి వరకు కౌంటర్ దాఖలు చేయాలని కోర్టు ఆదేశించడంతో తదుపరి విచారణ రేపు జరగనుంది. అనంతరం బెయిల్ పిటిషన్‌పై కోర్టు నిర్ణయం వెలువడే అవకాశం ఉంది. ఇప్పటికే ఉదయ్ కృష్ణారెడ్డికి ఉప్పరపల్లి కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించిన విషయం తెలిసిందే.

# మారనున్న కేబీఆర్ పార్కు రూపు రేఖలు

**దశ, హైదరాబాద్ :** హైదరాబాద్ ప్రజలకు మరో సూపర్ న్యూస్. నగరంలో ప్రముఖ పార్క్‌గా ప్రసిద్ధి పొందిన కేబీఆర్ పార్క్ వద్ద రూపురేఖలు పూర్తిగా మారనున్నాయి. ఈ పార్క్ వద్ద విపరీతమైన ట్రాఫిక్ రద్దీ ఉంటుంది. దీనిని తగ్గించేందుకు ప్రభుత్వం సరికొత్త ఆలోచన చేసింది. పార్క్ చుట్టూ ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌ల నిర్మాణానికి ముందడుగు వేసింది. మొత్తం 14 నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. ఏడు ప్రధాన కూడళ్ల వద్ద ఈ నిర్మాణాలు జరగనున్నాయి. మొన్నటివరకు కోర్టు కేసులు, భూసేకరణ ప్రక్రియ వల్ల కొంత జాప్యం జరగగా.. ఇప్పుడు అవన్నీ తొలగిపోయాయి. దీంతో అధికారులు ప్రక్రియను మరింత వేగవంతం చేశారు. రెండేళ్లల్లో పనులన్నీ పూర్తి చేయాలనే లక్ష్యం నిర్దేశించుకున్నారు. వాహనదారులకు ఇబ్బంది కలగకుండా పనులు త్వరతగతిన పూర్తి చేయాలని భావిస్తున్నారు.ఈ ప్రాజెక్టులో భాగంగా జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 36 నుంచి కేబీఆర్ పార్క్ రోడ్డు మధ్య నాలుగు లైన్ల ఫ్లైఓవర్




ఉంటుంది. ఇక పంజాగుట్ట నుంచి జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ వైపుకు 3 లైన్ల ఫ్లైఓవర్ నిర్మిస్తారు. ఇక మహారాజా అగ్రసేన జంక్షన్ నుంచి బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 10 వైపు 2 లైన్ల ఫ్లైఓవర్ నిర్మించనున్నారు. ఇక ఫిల్మ్ నగర్‌బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12 మధ్య 2 లైన్లతో కూడిన ఫ్లైఓవర్ ప్రతిపాదించారు. అలాగే జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్‌జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 45 మధ్య 2 లైన్ల ఫ్లైఓవర్ ఉంటుంది. ఇక వీటితో పాటు మొత్తం 6 అండర్‌పాస్‌లు నిర్మించనున్నారు. ఫిల్మ్ నగర్ జంక్షన్ నుంచి జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ వైపు 2 లైన్ల అండర్ పాస్, బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి నుంచి ఫిల్మ్ నగర్ వైపు ఒక అండర్ పాస్, ఎల్వీ ప్రసాద్ నుంచి పంజాగుట్ట వైపు 3 లైన్ల అండర్ పాస్, రోడ్డు నెంబర్ 45 నుంచి కేబీఆర్ పార్క్ ఎంట్రన్స్ వరకు ఒక అండర్ పాస్ ఉంటుంది. దాదాపు ఈ ప్రాజెక్టులు పూర్తి చేయడానికి రూ.1090 కోట్లు అవసరం అవుతాయని అధికారులు అంచనా వేశారు. వీటిల్లో నిర్మాణ పనుల కోసం రూ.699.75 కోట్లు ఖర్చు కానుండగా.. భూసేకరణ ప్రక్రియ కోసం రూ.390 కోట్లు ఖర్చు అవుతాయని అంచనా వేస్తున్నారు. ఉక్కు వంతెనల నిర్మాణం వల్ల భూసేకరణ ఖర్చు తగ్గుతుందని, తక్కువ స్థలంలోనే పనులు చేపట్టవచ్చని అధికారులు చెబుతున్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే కేబీఆర్ పార్క్ వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ తగ్గుతుంది. సిగ్నల్ ఫ్రీ జర్నీ వాహనదారులకు లభించనుంది. హైటెక్ సిటీ, ఫిల్మ్ నగర్ వైపు వెళ్లేవారు వేగవంతంగా చేసుకోవచ్చు.

# డ్రగ్స్ ముప్పు నుంచి బయటపడేదెలా?

**మొదటి పేజీ తరువాయి**

ఆందోళన కలిగిస్తున్నాయి. డ్రగ్స్‌కు అలవాటుపడిన కొందరు వాటి కోసం డబ్బు సంపాదించేందుకు నేరాలకు పాల్పడే పరిస్థితులు కూడా కనిపిస్తున్నాయి.

### ఒక్క తలుపు మూస్తే.. మరో మార్గం

అధికారులు ఒక మార్గాన్ని అడ్డుకుంటే అక్రమ మాదకద్రవ్యాల సరఫరాదారులు మరో మార్గాన్ని ఎంచుకుంటున్నారు. టాస్క్‌ఫోర్స్, ప్రత్యేక దర్యాప్తు బృందాలు, నార్కోటిక్స్ నియంత్రణ చర్యలు కొనసాగుతున్నప్పటికీ డ్రగ్స్ సరఫరా పూర్తిగా అరికట్టడం సవాలుగా మారింది. అందుకే కేవలం అరెస్టులు, కేసులతో సమస్యకు శాశ్వత పరిష్కారం లభించదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### శిక్షలతో పాటు దర్యాప్తు బలోపేతం

ఎన్‌డీపీఎస్ చట్టం కింద నమోదయ్యే కేసుల్లో దర్యాప్తు నాణ్యత, సాక్ష్యాల సేకరణ, ఫోరెన్సిక్ పరీక్షలు, కేసుల సత్వర విచారణ కీలకం. తనిఖీలు, నమూనాల సేకరణ, ఫోరెన్సిక్ పరీక్షల్లో జాప్యం వంటి లోపాలు నిందితులకు ప్రయోజనం కలిగించే అవకాశం ఉంది. పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించేందుకు అవసరమైన చోట ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయడంతో పాటు దర్యాప్తు అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉంది.

### అసలు రక్షణ ఇంటి నుంచే

డ్రగ్స్ నియంత్రణలో తల్లిదండ్రుల పాత్ర అత్యంత కీలకం. పిల్లలు పాఠశాల, కళాశాల నుంచి సమయానికి ఇంటికి వస్తున్నారా? ఎవరితో స్నేహం చేస్తున్నారు? వారి ప్రవర్తనలో అకస్మాత్తుగా మార్పులు కనిపిస్తున్నాయా? ఖర్చులు పెరిగాయా? అనే అంశాలను తల్లిదండ్రులు గమనించాలి. అదే సమయంలో పిల్లలపై అనుమానంతో కాకుండా స్నేహపూర్వకంగా మాట్లాడాలి. సమస్య ఉన్నట్లు గుర్తిస్తే దాచిపెట్టకుండా నిపుణుల కౌన్సెలింగ్, అవసరమైన చికిత్స వైపు తీసుకెళ్లాలి.

### విద్యాసంస్థల బాధ్యత కూడా కీలకం

స్కూళ్లు, కాలేజీలు కేవలం చదువుకే పరిమితం కాకుండా విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక నష్టాలపై నిరంతరం అవగాహన కల్పించాలి. విద్యార్థుల్లో సమస్యలను ముందుగానే గుర్తించే కౌన్సెలింగ్ వ్యవస్థలను బలోపేతం చేయాలి. క్యాంపస్‌లో డ్రగ్స్ సరఫరా కాకుండా కఠినమైన పర్యవేక్షణ అవసరం.

### ఉన్నత విద్యాసంస్థల్లో పరీక్షలు

దేశంలోని ఉన్నత విద్యాసంస్థల్లో డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టేందుకు విద్యార్థులకు స్వచ్ఛందంగా డ్రగ్ టెస్టులు నిర్వహించే కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం చేపడుతున్నట్లు ప్రకటించింది. ఈ పరీక్షలు గోప్యంగా, స్వచ్ఛందంగా నిర్వహించి, ఫలితాలను విద్యార్థులపై ప్రతికూల చర్యలకు కాకుండా కౌన్సెలింగ్ కోసం ఉపయోగించాలనే మార్గదర్శకాలు కూడా ఉన్నాయి. దశలవారీగా కేంద్ర నిధులతో నడిచే ఉన్నత విద్యాసంస్థల్లో ఈ కార్యక్రమాన్ని విస్తరించే లక్ష్యాన్ని కేంద్రం ప్రకటించింది. యువతను డ్రగ్స్‌కు దూరంగా ఉంచేందుకు అవగాహన, ముందస్తు గుర్తింపు, కౌన్సెలింగ్, అవసరమైన చికిత్సతో పాటు చట్టపరమైన చర్యలు సమాంతరంగా సాగాలి.

### యువత భవిష్యత్తును కాపాడాలి

డ్రగ్స్ తాత్కాలికంగా ఉత్తేజాన్ని కలిగించినా వాటి ప్రభావం వ్యక్తి ఆరోగ్యం, కుటుంబం, చదువు, ఉద్యోగం, భవిష్యత్తుపై తీవ్రంగా పడే ప్రమాదం ఉంది. ఒక్క వ్యక్తి డ్రగ్స్‌కు బానిస కావడం కుటుంబాన్ని కూడా సంక్షోభంలోకి నెట్టవచ్చు. అందుకే డ్రగ్స్ నియంత్రణ కేవలం పోలీసుల బాధ్యత కాదు. కుటుంబం, విద్యాసంస్థలు, ప్రభుత్వం, సమాజం కలిసి పోరాడాల్సిన అంశం. ప్రతి తల్లిదండ్రి తన పిల్లలపై శ్రద్ధ పెట్టాలి. ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థుల్లో మార్పులను గమనించాలి. ప్రతి విద్యార్థి డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని సంకల్పించాలి. ప్రతి ఇల్లు డ్రగ్స్‌కు దూరంగా ఉంటేనే హైదరాబాద్ నుంచి తెలుగు రాష్ట్రాల వరకు, అక్కడి నుంచి దేశవ్యాప్తంగా మాదకద్రవ్యాల రహిత సమాజం నిర్మించడం సాధ్యమవుతుంది. డ్రగ్స్‌కు నో చెప్పడం ఒక్కరి నిర్ణయం కాదు.. ఒక తరం భవిష్యత్తును కాపాడే బాధ్యత.

# బిడ్ వేసి చేతులెత్తేసిన బిల్డర్

**దశ, హైదరాబాద్ :** హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగంలో సంచలనం సృష్టిస్తూ కోకాపేట ప్లాట్ నంబర్ 17లో 4.59 ఎకరాల భూమికి ఎకరాకు రూ.136.50కోట్ల చొప్పున బిడ్ వేసిన వజ్రా కన్‌స్ట్రక్షన్స్ చెల్లింపులు చేయలేకపోయింది. దీంతో వేలం నిబంధనల ప్రకారం హెచ్ఎమ్‌డీఏ సదరు సంస్థ చెల్లించిన రూ. 5 కోట్ల ఈఎమ్‌డీ డిపాజిట్‌ను జప్తు చేసింది. ప్రీలాంచ్ విక్రయాల ద్వారా నిధులు సమీకరించాలనే వ్యూహం ఫలించకపోవటంతో భూమితో పాటు డిపాజిట్‌నూ సదరు సంస్థ కోల్పోయింది. కాగా, ఈ భూమిని మళ్లీ వేలం వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన కోకాపేట నియోపొలిస్ భూముల వేలంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. వేలంలో రికార్డు స్థాయిలో భారీ బిడ్ వేసి ప్లాట్‌ను దక్కించుకున్న వజ్రా కన్‌స్ట్రక్షన్స్ అనే రియల్ ఎస్టేట్ సంస్థ నిర్ణీత గడువులోగా నిధులు చెల్లించలేక చేతులెత్తేసింది. దీంతో వేలం నిబంధనలను కఠినంగా అమలు చేస్తూ.. హెచ్ఎండీఏ సదరు నిర్మాణ సంస్థ భద్రతా డిపాజిట్‌గా చెల్లించిన రూ. 5 కోట్ల అర్నెస్ట్ మనీ డిపాజిట్ (EMD)ని జప్తు చేసింది.కోకాపేట ప్లాట్ నంబర్ 17లోని 4.59 ఎకరాల భూమికి వజ్రా కన్‌స్ట్రక్షన్స్ ఎకరాకు ఏకంగా రూ. 136.50 కోట్ల చొప్పున బిడ్ దాఖలు చేసి భూములు దక్కించుకుంది. ఈ లెక్కన ఆ భూమి మొత్తం విలువ రూ. 626 కోట్లకు పైగానే ఉంటుంది. అయితే, భూమి కొనుగోలుకు అవసరమైన పూర్తి ఆర్థిక ఇన్వెస్ట్‌మెంట్ సొంతంగా లేనప్పటికీ.. ప్రాజెక్టు ప్రకటించి ప్రీలాంచ్, ఓపెన్ టు పబ్లిక్ విక్రయాల ద్వారా కొనుగోలుదారుల నుంచి ముందస్తుగా నిధులు సమీకరించి ప్రభుత్వానికి చెల్లించవచ్చని ఆ సంస్థ భావించింది. అయితే మార్కెట్‌లో ఆశించిన స్థాయిలో ప్రీ లాంచ్ విక్రయాలు జరగకపోవడంతో ఆ వ్యూహం ఫలించలేదు. నిర్ణీత గడువు ముగిసినా డబ్బులు చెల్లించకపోవటంతో రూ. 5 కోట్ల డిపాజిట్‌ను హెచ్ఎండీఏ జప్తు చేసింది. ఫలితంగా వజ్రా కన్‌స్ట్రక్షన్స్ రూ. 600 కోట్లకు పైగా విలువైన కోకాపేట స్థలంతో పాటు రూ. 5 కోట్ల నగదును కోల్పోయి రెండు రకాలుగా నష్టాన్ని మూటగట్టుకుంది. భవిష్యత్ ప్రాజెక్టు విక్రయాలను నమ్ముకొని ఆర్థిక సామర్థ్యానికి మించి బిడ్లు వేయడం ఎంత ప్రమాదకరమో ఈ ఘటన స్పష్టం చేస్తోందని రియల్ ఎస్టేట్ నిపుణులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా.. చెల్లింపులు జరగని నేపథ్యంలో ప్లాట్ నంబర్ 17 కింద ఉన్న 4.59 ఎకరాల స్థలానికి త్వరలోనే మళ్లీ పారదర్శకంగా బహిరంగ వేలం నిర్వహించాలని హెచ్ఎండీఏ నిర్ణయించింది. గత వేలంలో ఎకరాకు 136.50 కోట్ల కోట్లకు పైగా పలుకగా.. కొత్త వేలంలో ఈ స్థలానికి ఎలాంటి ధర నమోదవుతుందనేది ఇప్పుడు నగర రియల్టీ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.కోకాపేట్‌లోని నియోపోలిస్, గోల్డెన్ మైల్ లేఅవుట్లతో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న విలువైన భూములను వేలం వేయడానికి హెచ్ఎండీఏ సిద్ధమైంది. నిధుల సమీకరణే లక్ష్యంగా వేలానికి రెడీ అయ్యారు. నియోపోలిస్‌లో ఎకరానికి కనీస ధర రూ. 120 కోట్లుగా నిర్ణయించగా.. గోల్డెన్ మైల్‌లో రూ. 70 కోట్లుగా ఫిక్స్ చేసారు. ఈ వేలం ప్రక్రియ ఆగస్టు 24 నుంచి సెప్టెంబర్ 9 వరకు జరగనుంది.

# ఫిరాయింపు ఎమ్మెల్యేల రివర్స్ గేర్

**దశ, హైదరాబాద్:** బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేల వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో మరోసారి చర్చనీయాంశంగా మారింది. అధికార పార్టీలో చేరితే నియోజకవర్గాలకు నిధులు, అభివృద్ధి పనులు వేగంగా వస్తాయని భావించిన పలువురికి ఆశించిన స్థాయిలో ఫలితాలు కనిపించకపోవడంతో అసంతృప్తి పెరుగుతోందన్న ప్రచారం జరుగుతోంది. దీంతో కొందరు ఎమ్మెల్యేలు తిరిగి బీఆర్ఎస్ వైపు చూసే అవకాశం ఉందన్న చర్చ మొదలైంది. ఈ చర్చకు బాన్సువాడ ఎమ్మెల్యే, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యలు మరింత బలం చేకూర్చాయి. బీర్కూరులో జరిగిన కార్యకర్తల సమావేశంలో తాను మంత్రి పదవి కోసం, డబ్బు కోసం కాంగ్రెస్‌లో చేరలేదని, కేవలం నియోజకవర్గ అభివృద్ధి కోసమే పార్టీ మారానని ఆయన చెప్పినట్లు సమాచారం. సీఎం రేవంత్‌రెడ్డి ఆరు నెలల్లో పెండింగ్ పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చినా ఆశించిన స్థాయిలో పనులు జరగడం లేదని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. పోచారం వ్యాఖ్యలతో ఇతర ఫిరాయింపు ఎమ్మెల్యేల వైఖరిపైనా చర్చ మొదలైంది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఇటీవల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వాన్ని, గత ప్రభుత్వ పాలనను ప్రశంసిస్తూ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపాయి. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కూడా కాంగ్రెస్ కార్యకలాపాలకు కొంత దూరంగా ఉంటున్నారన్న ప్రచారం ఉంది. ఆయన సోదరుడు బీఆర్ఎస్‌కు అనుకూలంగా వ్యవహరించడం ఈ చర్చకు మరింత ఊతమిచ్చింది. ఇక జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్, గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డిలు కూడా నియోజకవర్గ అభివృద్ధి పనుల విషయంలో ఒత్తిడి ఎదుర్కొంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. హామీ ఇచ్చిన పనులు, నిధులు ఆశించిన స్థాయిలో అందకపోవడం వారికి రాజకీయంగా ఇబ్బందిగా మారిందన్న చర్చ ఉంది. ఫిరాయింపు ఎమ్మెల్యేల నుంచి అసంతృప్తి సంకేతాలు రావడంతో కాంగ్రెస్ నాయకత్వం కూడా అప్రమత్తమైనట్లు తెలుస్తోంది. పార్టీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ ఈ అంశంపై దృష్టి సారించినట్లు సమాచారం. పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ కూడా ప్రభుత్వం ఎదుర్కొంటున్న ఆర్థిక పరిస్థితిని ఎమ్మెల్యేలు అర్థం చేసుకోవాలని సూచించారు.

### మోడీ బహుమతుల వేలంతో —

# 52 కోట్లకు పైగా నిధులు

**మొదటి పేజీ తరువాయి**

నిధులు సమకూరినట్లు కేంద్రం తెలిపింది. సాధారణంగా ప్రధాని మోదీ జన్మదినమైన సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 31 వరకు ఈవేలం నిర్వహిస్తున్నట్లు కేంద్ర మంత్రి వివరించారు. 2019కు ముందు ప్రధానికి వచ్చిన ఇలాంటి కానుకలు, స్మృతిచిహ్నాలను ఆధ్వర్యంలో ఈ తరహాలో వేలం వేసే విధానం లేదని కేంద్ర మంత్రి షేకావత్ పేర్కొన్నారు.ప్రధాని మోదీకి అందిన కానుకల్లో దేశంలోని వివిధ ప్రాంతాల సంస్కృతి, కళా సంపదకు ప్రతీకలైన వస్తువులు ఉంటాయి. పెయింటింగ్స్, శిల్పాలు, హస్తకళా వస్తువులు, మతపరమైన విగ్రహాలు, చేనేత వస్త్రాలు, క్రీడా స్మృతిచిహ్నాలు వంటి అనేక రకాల వస్తువులు వేలానికి వస్తాయి. వాటిలో కొన్ని వస్తువులు భారీ ధరలు పలికాయి. గాజు ఫ్రేమ్‌లో మినియేచర్ ఆలయ నిర్మాణంతో ఉన్న తుల్జా భవానీ విగ్రహం సుమారు రూ.1.03 కోట్ల వరకు ధర పలికినట్లు సమాచారం.అయోధ్య రామమందిర మెటాలిక్ మోడల్, జమ్మూకశ్మీర్ పష్మినా షాల్, తంజావూరు రామ దర్బార్ చిత్రం, నటరాజ మెటాలిక్ విగ్రహం, గుజరాత్ రోగన్ ఆర్ట్ 'ట్రీ ఆఫ్ లైఫ్', నాగాలాండ్ చేనేత షాల్, వివిధ వస్త్రాలు, పెయింటింగ్స్ కూడా వేలంలో ఆకర్షణగా నిలిచాయి. క్రీడలకు సంబంధించిన వస్తువులు కూడా వేలంలో ప్రత్యేక ఆసక్తిని కలిగించాయి. 2024 పారాలింపిక్స్ క్రీడాకారుల బూట్లు, ఒలింపిక్, పారాలింపిక్ క్రీడా సామగ్రితో పాటు స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రాకు సంబంధించిన జావెలిన్, రామమందిరం, కాశీ విశ్వనాథ ఆలయ నమూనాలు వంటి వస్తువులు కూడా వేలంలోకి వచ్చాయి.ప్రధాని మోదీకి వచ్చిన కానుకలను వేలం వేసి వచ్చిన ఆదాయాన్ని నమామి గంగే కార్యక్రమానికి కేటాయిస్తున్నట్లు కేంద్రం తెలిపింది. గంగా నది పరిరక్షణ, పునరుద్ధరణ, కాలుష్య నివారణ వంటి కార్యక్రమాలకు ఈ నిధులను ఉపయోగిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ కార్యక్రమమైన నమామి గంగే కింద గంగా, దాని ఉపనదుల్లో కాలుష్యాన్ని తగ్గించడం, నదీ పునరుజ్జీవనం, పర్యావరణ వ్యవస్థను పరిరక్షించడం వంటి చర్యలు చేపడుతున్నారు. మురుగునీటి శుద్ధి మౌలిక సదుపాయాలు, రివర్‌ఫ్రంట్ అభివృద్ధి, జీవవైవిధ్య పరిరక్షణ తదితర ప్రాజెక్టులు ఇందులో భాగంగా ఉన్నాయి. ఈ కార్యక్రమాన్ని నేషనల్ మిషన్ ఫర్ క్లీన్ గంగా) అమలు చేస్తోంది.ప్రధాని మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కూడా తనకు వచ్చిన కానుకలను వేలం వేసి వచ్చిన మొత్తాన్ని బాలికల విద్య కోసం వినియోగించేవారని కేంద్రం వెల్లడించింది. ఇప్పుడు అదే విధానాన్ని జాతీయ స్థాయిలో కొనసాగిస్తూ.. వేలం ద్వారా వచ్చే ఆదాయాన్ని గంగా నది పరిరక్షణకు కేటాయిస్తున్నట్లు తెలిపింది. అంటే.. సంస్థలు ప్రధానమంత్రికి అందించిన కానుకలు వ్యక్తిగతంగా భద్రపరచడం కాకుండా.. వాటిని ప్రజా ప్రయోజనానికి ఉపయోగపడేలా వేలం వేస్తున్నారు. వేలం ద్వారా వచ్చిన నిధులు దేశంలోని కీలక పర్యావరణ కార్యక్రమానికి మళ్లించడం ప్రధాన అంశంగా నిలుస్తోంది.

Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com